సాక్షి విజయనగరం

గురువారం । 23 । జనవరి । 2025



'ఉపాధి' పనుల్లోనూ రాజకీయం!

ఉపాధి హామీ పనులనూ టీడీపీ కూటమి ప్రభుత్వం రాజకీయం చేస్తోంది. పార్టీ కార్యకర్తలకే మేట్‌లు కట్టబెడుతోంది. - 8లో



స్త్రీనిధి నిధులు పక్కదారి

బొబ్బిలి మండలంలోని ముత్తాయివలస గ్రామంలో పొదుపు సంఘాలకు మంజూరైన నిధులు పక్కదారి పట్టాయి. - 8లో

జేఈఈ పరీక్షలు ప్రారంభం

విజయనగరం అర్బన్: జాతీయ స్థాయి ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ తొలివిడత పరీక్షలు జిల్లాలో బుధవారం ప్రారంభమయ్యాయి. సీతం కళాశాల ప్రాంగణంలోని అయాన్ డిజిటల్ జోన్, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాల్లో తొలి రోజు జరిగిన పరీక్షకు 1,010 మందికి 996 మంది హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు.

న్యూస్‌రీల్

మలేరియా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యేశ్వరి

విజయనగరం ఫోర్ట్: మలేరియా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రెండు వారాలకు గృహ సందర్శన చేపట్టాలన్నారు. ఎవరిలోనైనా మలేరియా లక్షణాలు ఉంటే రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, విశాఖ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, గుంటూరు జోన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వీర్రాజు, డీఎంఓ మణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్‌ఎస్ సర్వే వేగవంతం చేయాలి

రామభద్రపురం: కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన ఎన్‌పీఎస్‌ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్) సర్వేను వేగవంతం చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీటి రామారావు ఆదేశించారు. మండలంలోని ఆరికతోట, బూసాయవలస రైతు సేవా కేంద్రాలను ఆయన బుధవారం సందర్శించారు. బూసాయవలసలోని పంటపొలాల్లో వీఏఏలు చేస్తున్న ఎన్‌పీఎస్‌ఎస్ సర్వేను పరిశీలించారు. ధాన్యం అమ్మకం, దిగుబడిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏవో వెంటకటయ్య, వీఏఏ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన ఎక్సైజ్ శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

గంట్యాడ: మండలంలోని బెల్టుషాపులు అధికంగా నిర్వహిస్తున్న అంశంపై 'మంత్రి ఇలాకాలో బెల్టు షాపులో జోరు..!' అనే శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. నరవ గ్రామంలో ఉన్న సప్తగిరి వైన్ షాపుపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇనస్పెక్టర్ ఎం. విజయలక్ష్మి తెలిపారు.

యువ మహాసదస్సును విజయవంతం చేయండి



వారధి-2025 యువ మహాసదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు

విజయనగరం రూరల్: మండలంలోని శ్రీరామ నారాయణం ఆలయ ప్రాంగణంలో రామాయణ విశిష్టతను నేటితరం యువతకు తెలియజేసేలా ఈ నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహించనున్న వారధి-2025 యువ మహాసదస్సును విజయవంతం చేయాలని ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు నారాయణం శ్రీనివాస్ కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. 26న వివిధ ద్రవ్యాలు, పిల్లలు, పెద్దలు రాసిన వ్యాసాలతో ప్రపంచంలో ఎక్కడా జరగని రీతిలో రామనారాయణంలోని శ్రీరామచంద్రుడికి సహస్రనామార్చన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ గౌరీ నిత్య, ట్రస్ట్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

యూపీ పాఠశాలలకు మంగళం



పొమ్మనకుండానే పొగపెడుతున్నారు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూపీ పాఠశాలలో 6, 7, 8 తరగతులు చదువుతున్న వారు 60 మంది విద్యార్థులు కంటే ఎక్కువ ఉంటే ఆ పాఠశాలలను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలి. అయితే, అక్కడ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ తగిన భవనాలు లేవని వాటిని కూడా డీగ్రేడ్ చేస్తూ ప్రైమరీ పాఠశాలలుగా మార్చేందుకు సర్కారు స్కెచ్ గీసింది. దీని ప్రకారం వీరఘట్టం మండలంలోని నడిమికెల్ల యూపీ పాఠశాల డీ గ్రేడ్ కానుంది. వాస్తవానికి ఇక్కడ 6, 7, 8 తరగతులు చదువుతున్న వారు 62 మంది ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పాఠశాల హైస్కూల్‌గా మారాలి. దీనికి తగినట్టుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేనందున దీన్ని ప్రైమరీగా మార్చేస్తున్నారు. ఇలా వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి జిల్లా వ్యాప్తంగా ఒక్క యూపీ పాఠశాల లేకుండా చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం.

- జిల్లాలో 168 యూపీ పాఠశాలలు ప్రైమరీ పాఠశాలలుగా మార్పు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- ఆవేదనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు
- సంస్కరణలు సరికాదంటున్న మేధావి వర్గం

విజయనగరం అర్బన్:

పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల చదువుకు ఆధారమైన ప్రభుత్వబడి కనుమరుగు కానుందా.. అంటే... ప్రస్తుతం అవుననే సమాధానం వినిపిస్తోంది. కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తూ సర్కారు బడులను నిర్వీర్యం చేసేందుకు రంగం సిద్ధంచేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తొలుత ప్రాథమికోన్నత పాఠశాలలను (యూపీ) మూసివేసేందుకు కార్యాచరణ చేపట్టింది. సర్కారు నిబంధనల వల్ల విజయనగరం జిల్లాలోని 168 ప్రాథమికోన్నత పాఠశాలలు స్థాయి తగ్గి ప్రాథమిక పాఠశాలలుగా మారనున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరిబడిని బాగుచేసింది. ఆధునిక హంగులు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా నిలబెట్టింది. ఆంగ్ల విద్యతో పాటు సీబీఎస్‌ఈ సిలబస్‌ను అందుబాటులోకి తెచ్చింది. సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యాసంస్కరణలు అమలుచేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వారికి సర్కారు విద్యను దూరం చేసేలా అడుగులు వేస్తోందన్న విమర్శలు విద్యాశాఖ వర్గాల నుంచే వెల్లువెత్తుతున్నాయి.

ప్రాథమికోన్నత పాఠశాలలకు చెల్లు చీటీ

జిల్లాలో 12,529 మంది విద్యార్థులు చదువుతున్న 168 ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడనున్నాయి. 60 మందికి తక్కువ విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను సమీప ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తారు. 60 మందికి పైగా ఉన్న స్కూళ్లను ఉన్నత పాఠశాలల్లో కలుపుతారు. విలీనం చేయనున్న దాదాపు 120 స్కూళ్లకు ఉన్నత పాఠశాలలు 5 కిలోమీటర్లు దాటి ఉన్నాయి. దీంతో విలీనం చేయనున్న 120 స్కూళ్ల విద్యార్థులు కూడా ప్రైవేటు స్కూళ్లనే ఆశ్రయించే అవకాశాలున్నాయి.

ప్రభుత్వ నిబంధనలు.. చేకూరే నష్టం..

- యూపీ పాఠశాలల్లో 6,7,8 తరగతులు చదువుతున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 30లోపు ఉంటే ఆ పాఠశాలలను ప్రైమరీ పాఠశాలలుగా డీ గ్రేడ్ చేయాలి.
- 30–59 మధ్య విద్యార్థుల సంఖ్య ఉండి, ఆయా పాఠశాలలు సమీప ఉన్నత పాఠశాలలకు 3 కి.మీ దూరంలో ఉంటే వాటిని ఆయా హైస్కూల్‌లో విలీనం చేయాలి.
- విద్యార్థుల సంఖ్య 60 పైబడితే వాటిని ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- జిల్లాలోని మొత్తం 1,717 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత పాఠశాలలు 232, ప్రాథమిక పాఠశాలలు 1,317, ప్రాథమికోన్నత పాఠశాలలు 168 ఉన్నాయి. మొత్తం స్కూళ్లలో 1,05,347 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 61,443 మంది ఉన్నత పాఠశాలల్లోను, 31,375 మంది ప్రాథమిక పాఠశాలల్లోను, 12,529 మంది ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు.
- జిల్లాలో ఒకే ఉపాధ్యాయుడిగా ఉన్న 303 ప్రాథమిక పాఠశాల్లో 30 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్నారు. వీటిలోని పంచాయతీ పరిధిలోని మరో స్కూల్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా తీసుకొని ఈ స్కూళ్లకు చెందిన 3, 4వ తరగతులను కలుపుతారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌లో కలిపే ప్రాథమిక పాఠశాలలు కిలోమీటరు దూరం దాటినవి దాదాపు 200 వరకు ఉన్నాయి. ఈ పాఠశాల చిన్నారులంతా ఆయా మోడల్ ప్రైమరీ స్కూళ్లకు వెళ్లే పరిస్థితి ఉండదు. రవాణా సౌకర్యాలను ఆశ చూపి ప్రైవేటు స్కూళ్ల వారు చేర్చుకుంటారు. దీంతో ఆయా 200 ప్రైమరీ స్కూళ్లు సైతం మూత పడతాయన్నది విద్యావేత్తల అభిప్రాయం.

● నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా మెలికలు..

యూపీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30 లోపు ఉంటే ఆ పాఠశాలలను డీ గ్రేడ్ చేస్తున్నారు. అదే 30–59 మధ్య ఉంటే అట్టి పాఠశాలలను యూపీలుగా కొనసాగించుకోవచ్చు. అయితే, ఆ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టు లు ఉండవని, ఎస్జీటీ లే సబ్జెక్టులు బోధించాల్సి ఉంటుందని సర్కారు మెలిక పెట్టింది. యూపీ పాఠశాలలు ఉన్న చోట సబ్జెక్టు టీచర్లు లేకపోతే విద్యార్థులు నష్టపోతారు. అందుచే విద్యార్థులు ఎక్కువ ఉన్న యూపీ పాఠశాల కూడా డీ గ్రేడ్‌గా మారనున్నాయి.

నెలాఖరుకు పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

- విద్యాశాఖ వర్క్‌షాప్‌లో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డీఈఓ మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆమోదయోగ్యమైన పద్ధతిలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జీవో 117 ఉపసంహరణ–పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పునర్వ్యవస్థీకరణ కారణంగా ఏ ఒక్క విద్యార్థి నష్టపోకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు పాఠశాలలకు చేసే రాకపోకలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపించే ఈ కార్యక్రమం ఎంతో కీలకమైనదిగా పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు కూడా ఎటువంటి నష్టం జరగకూడదని, అందుబాటులో ఉన్న భవనాలు, ఇతర మౌలిక వసతులు వృథా కాకుండా వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొనే విధంగా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఒకవేళ ఉపాధ్యాయులను మిగులు చూపినా వారిని ఇతర జిల్లాలకు పంపించేది లేదని, వారి సేవలను ఇక్కడే వినియోగించు కోవడం జరుగుతుందని చెప్పారు. ప్రీ ప్రైమరీ స్కూల్ విషయంలో ఐసీడీఎస్ సిబ్బందితో చర్చించాలన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఈ నెల 25 నాటికి కచ్చితమైన జాబితాను సిద్ధంచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, విద్యాశాఖ ఏడీ బేత గౌరీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విధానాలతో ప్రైమరీ పాఠశాలగా మారనున్న వీరఘట్టం మండలం కిమ్మి యూపీ పాఠశాల

తరగతికి ఒక టీచర్ ఉండాల్సిందే...



జీవో 117 ఉపసంహరణ చేస్తూ ప్రత్యామ్నాయంగా చేపడుతున్న పునఃవ్యవస్థీకరణ చర్యలు పేద విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదు. గతంలో టీడీపీ పాలనలో పలు ప్రైమరీ స్కూళ్లను మూసేసి చేపట్టిన పంచాయతీ పరిధిలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు వ్యవస్థ ఫెయిల్ అయింది. మరలా అదే వ్యవస్థను తీసుకురావాలంటే ప్రైమరీ స్కూళ్లను పరిరక్షిస్తూ అన్ని తరగతులకు ఒక్కో టీచర్‌ను విధిగా ఏర్పాటు చేయాలి. పంచాయతీ పరిధిలో అన్ని పాఠశాలలను కలపాలనుకుంటే విద్యార్థికి దూరభారం లేకుండా చూడాలి.

– డి.శ్యాం, రాష్ట్ర కార్యదర్శి, ఎస్‌టీయూ

ప్రభుత్వ నిబంధనల మేరకే పునఃవ్యవస్థీకరణకు కసరత్తు



ప్రభుత్వ తాజాగా నిబంధనల మేరకు 117 జీవో ఉపసంహరణ నేపథ్యంలో పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రక్రియ కోసం కసరత్తు చేస్తున్నాం. తాజా విద్యార్థుల నమోదును తీసుకుంటున్నాం. ఈ నెల 25వ తేదీ లోపు పూర్తి వివరాలను తీసుకొని పంచాయతీ పరిధిలోని ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేస్తాం. సేకరించిన తాజా వివరాల అనంతరం ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ స్కూళ్ల సంఖ్యను ప్రకటిస్తాం.

– యుమాణిక్యం నాయుడు, డీఈఓ

దివ్యాంగులను బాధించడం భావ్యమా?

- అర్హులైన ఒక్కరి పింఛను తొలగించినా ఆందోళన తప్పదు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి శ్రీనివాసరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: పింఛన్ల పునఃపరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగులను బాధించడం భావ్యం కాదని విజయనగరం జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల్లో అర్హులైన ఏ ఒక్కరి పింఛను తొలగించినా వారి తరపున వైఎస్సార్‌సీపీ ఆందోళన తప్పదని అధికారులను హెచ్చరించారు. గురువారం నుంచి దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలనకు అధికారులు సిద్ధమైన నేపథ్యంలో బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రస్తుతం పింఛను పొందుతున్న దివ్యాంగుల్లో ఇంటికి, మంచానికే కొన్నేళ్లుగా పరిమితమైనవారే ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛనుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పింఛన్ల పునఃపరిశీలన పేరుతో బాధించడం సరికాదన్నారు. ఆసుపత్రుల్లో పరిశీలనా కేంద్రాలకు వచ్చి తనిఖీలు చేయించుకోవాలని షరతు పెట్టడానికి ఖండించారు. ఇది వారిని వ్యయప్రయాసలకే గాక శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. బుద్ధిమాంద్యం, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారిని ఆసుపత్రులకు తీసుకురావడం కుటుంబసభ్యులకు ఎంతో కష్టమవుతుందన్నారు. కేవలం సామాజిక పింఛన్ల కోత వేయడానికే కూటమి ప్రభుత్వం ఇప్పుడీ పింఛన్ల పునఃపరిశీలనకు తెరలేపిందని విమర్శించారు. అర్హులైన దివ్యాంగుల్లో ఏ ఒక్కరి పింఛను తీసేసినా ఊరుకోబోమన్నారు. వారి తరపున తమ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి సిద్ధమని హెచ్చరించారు.

ఏవోబీ వైపు మావోలు?



- కొద్దిరోజులుగా దండకారణ్యంలో కాల్పుల మోత
- క్యాడర్‌ను, అగ్రనేతలను కోల్పోతున్న మావోయిస్టులు
- మళ్లీ ఏవోబీవైపు అడుగులు వేయవచ్చన్న ప్రచారం
- మన్యం ప్రాంతాన్ని షెల్టర్ జోన్‌గా భావించే అవకాశం

సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మీదుగా మన్యంవైపు మావోయిస్టుల అడుగులు పడనున్నాయా.. ఇన్నాళ్లూ తమకు ఆశ్రయమిచ్చిన దండకారణ్యంలో వరుస తుపాకుల మోతలతో అగ్రనాయకత్వాన్ని, క్యాడర్‌ను కోల్పోతున్న 'అన్నలు'.. షెల్టర్ జోన్‌గా మరలా ఏవోబీని ఆశ్రయించే అవకాశాలున్నాయా... ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు వర్గాల్లోనూ, సరిహద్దు గ్రామాల ప్రజల్లోనూ ఇదే చర్చ జోరుగా నడుస్తోంది. కొంతకాలంగా మావోయిస్టుల అలజడి లేకుండా మన్యం జిల్లా స్తబ్దుగా ఉంది. 2022లో ఏవోబీ నుంచి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వైపు అన్నలు తరలివెళ్లారు. ఆ తర్వాత చాలా ఏళ్లు దండకారణ్యంలోనే స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. కొన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో ఒడిశా–ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో భీకరంగా కాల్పులు జరుగుతున్నాయి. పలువురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. మంగళవారం కూడా పెద్ద ఎత్తున మావోయిస్టులు తమ క్యాడర్‌ను పోగొట్టుకున్నారు. ఇలా వరుస ఘటనలతో దాదాపు 190 మందికి పైగా తమ అగ్రనాయకత్వంతో పాటు, విలువైన క్యాడర్‌ను కోల్పోవడంతో.. అక్కడ సురక్షితం కాదని భావిస్తున్న మావోయిస్టులు కొన్నాళ్లపాటు దూరంగా తల దాచుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏవోబీ మీదుగా మన్యంవైపు తిరిగి వస్తారన్న ప్రచారం సాగుతోంది. దీంతో పోలీసు యంత్రాంగం కూడా అప్రమత్తమైనట్లు సమాచారం.

ఆయుధాలను పక్కన పెట్టి..

దండకారణ్యం వదిలి, మన్యం వైపు వచ్చే ఆలోచనలో ఉన్న మావోయిస్టులు... ఈ ప్రాంతాన్ని కేవలం షెల్టర్ జోన్‌గా మాత్రమే పరిగణించే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఇక్కడ వారి కార్యకలాపాలను పక్కన పెట్టి, కొద్దిరోజుల పాటు సాధారణ జీవనం గడుపుతారన్న చర్చ నడుస్తోంది. వారి ఆయుధాలను విడిచి, దళ యూనిఫారాలను పక్కన పెట్టి.. గిరి ప్రాంతాల్లో గిరిజనుల బంధువుల మాదిరిగానే సాధారణ జీవితం కొన్నాళ్లు గడిపే అవకాశం ఉందని తెలుస్తోంది. మరలా దండకారణ్యంపై పట్టు పెంచుకుని అటువైపు వెడలే వరకూ ఈ ఏవోబీని కేవలం షెల్టర్‌జోన్‌గానే పరిగణిస్తారని సమాచారం.

అధికార యంత్రాంగం అప్రమత్తం?

మావోలు ఏవోబీ వైపు వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారుల నుంచి పోలీసు యంత్రాంగానికి హెచ్చరికలు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైనట్లు సమాచారం. ఇప్పటికే పోలీసులతోపాటు ప్రత్యేక బలగాలు తరచూ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. కల్వర్టుల కింద తనిఖీలు చేపడుతున్నాయి. మరోవైపు పార్వతీపురం డివిజన్ పరిధిలోని సాలూరు, పాచిపెంట, మక్కువ, పార్వతీపురం, కొమరాడ మండలాల్లో వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించి, యువతకు చేరవయ్యారు. అదే మాదిరి మరలా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

మన్యంలో మావోయిస్టుల ముద్ర..

శ్రీకాకుళం–కొరాపుట్ డివిజన్ కమిటీ తదితర దళాలతో గతంలో పార్వతీపురం మన్యం పరిసరాల్లో మావోయిస్టుల కదలికలు ఉండేవి. వారి ఉనికిని చాటుకునేలా కొన్ని సంఘటనలు సైతం చోటుచేసుకున్నాయి.

- 2001లో సీఐ ముద్దాడ గాంధీని సాలూరు కోర్టులో మావోయిస్టులు కాల్చి చంపారు.
- 2008లో పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఎగువశెంబిలో తాడంగి సాన్నంనాయుడును హతమార్చారు.
- 2012లో మక్కువ మండలం ఆలుగురు వద్ద భూమిలో పోలీసులకు మావోల డంప్ లభించింది.
- 2012లో మక్కువ మండలం ఎర్రసామంతవలసలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌ను పేల్చివేశారు.
- 2012లో ఏవోబీలో ఆంధ్రా సరిహద్దుకు కూతవేటు దూరంలో ఒడిశాలోని సుంకి వద్ద మావోయిస్టులు మైన్ ప్రూఫ్ వ్యాన్ పేల్చివేశారు. దీంతో నలుగురు బీఎస్‌ఎఫ్ సిబ్బంది మరణించారు.
- 2015లో సాలూరు సమీపంలోని ఏవోబీ ప్రాంతమైన రణసింగిలో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి.
- 2016లో ఇన్‌ఫార్మర్ నెపంతో సాలూరు మండలం జాకరివలసలో పూసర్ల వెంకటరావును కాల్చి చంపారు.
- 2018లో పి.కోనవలస ఘాట్ రోడ్డు ముంగేరు గుమ్మి వద్ద మావోలు పేల్చిన మందుపాతరకు 8 మంది ఆర్మీ ట్రైనీ డ్రైవర్లు మరణించారు.
- 2018 మార్చిలో మక్కువ మీదుగా ఒడిశా సమీపంలో నారాయణపట్నం బ్లాక్ వద్ద పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.
- 2018 అక్టోబరు నెలలో నారాయణపట్నం బ్లాక్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు.

వచ్చే నెల 20 నుంచి నాటిక పోటీలు

- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కళాకారుల రాక
- డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చనమల్లు వెంకటరమణ, తదితరులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఫిబ్రవరి 20 నుంచి మూడు రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు జరజాపుపేటలోని వేంకటేశ్వర మురళీకృష్ణ కళ్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాటిక పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను స్థానిక సర్పంచ్, తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చనమల్లు మాట్లాడుతూ.. మొదటి రోజు రాత్రి 7 గంటలకు కళాంజలి (హైదరాబాద్) కళాకారులు 'రైతే రాజు' నాటికను.. 8.30 గంటలకు శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ (కాకినాడ) కళాకారులు 'ఎడారిలో వాన చినుకు' నాటికను ప్రదర్శిస్తారని తెలిపారు. 21వ తేదీ రాత్రి 7 గంటలకు శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం (బొరివంక, శ్రీకాకుళం జిల్లా) కళాకారులు 'కొత్త పరిమళం' నాటికను.. రాత్రి 8.30 గంటలకు విజయనగరానికి చెందిన సౌజన్య కళా ప్రవంతి (ఉత్తరాంధ్ర) కళాకారులు 'దేవరాగం' నాటికను ప్రదర్శిస్తారన్నారు. అలాగే 22వ తేదీ రాత్రి 7 గంటలకు కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి కళాకారుల 'చీకటి పువ్వు'.. రాత్రి 8.30 గంటలకు తెలుగు కళాసమితి (విశాఖపట్నం) కళాకారుల 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటికల ప్రదర్శనలుంటాయని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా, ఉత్తమ నటుడుగా, నాటిక పోటీల న్యాయ నిర్ణేతగా రాణించిన స్వర్గీయ ఆరిపాక బ్రహ్మానందం మాస్టారు పేరిట ఈ నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జరజాపుపేటకు చెందిన నేషనల్ ఆర్ట్స్ సమాజ్, నేషనల్ ఆర్ట్స్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర మురళీకృష్ణ కళ్యాణ మండపం ఆవరణలో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు నాటికలు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామపెద్దలు అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం నాయుడు, నల్లి చంద్రశేఖర్, ఆరిపాక కృష్ణమాచారి, ఆరిపాక శ్రీనివాసరావు, ఆరిపాక రాము, కిల్లంపల్లి రామారావు, పెనుమత్స అప్పలరాజు, ఎడ్ల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిపబ్లిక్‌డే వేడుకలకు పూడివలస సర్పంచ్‌కు ఆహ్వానం


పూడివలస సర్పంచ్ తిరుపతినాయుడు

బాడంగి: ఈనెల 26న ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్‌డే వేడుకలకు మండలంలోని పూడివలస గ్రామసర్పంచ్ రెడ్డితిరుపతినాయుడికి ఆహ్వానం వచ్చినట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ చెప్పారు. ఈ మేరకు మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాకు ఒకసర్పంచ్‌ను ఎంపిక చేసి పంపాలన్న కేంద్రం ఆదేశాలమేరకు యువకుడు, గ్రామాభివృద్ధిలో చురుకై నపాత్ర పోషిస్తున్న తిరుపతినాయుడిని ఎంపికచేసి పంపగా కేంద్రం నుంచి ఆహ్వానం వచ్చినట్లు చెప్పారు.గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంటింటికీ కుళాయిలు, పారిశుద్యం వంటి సామాజిక కార్యక్రమాల్లో ముందున్నందున సిఫార్స్ చేశామన్నారు. తన సేవలను గుర్తించి రిపబ్లిక్ వేడుకలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు చాలా ఆనందంగా సర్పంచ్ తిరుపతి నాయుడు సంతోషం వెలిబుచ్చారు.

గ్యాస్ సిలిండర్ల వ్యాన్ బోల్తా


ఒబ్బంగి ఘాట్‌రోడ్డులో బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల వ్యాన్

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలంలోని ఒబ్బంగి ఘాట్‌రోడ్డులో బుధవారం పెనుప్రమాదం తప్పింది. కురుపాం నుంచి గ్యాస్‌సిలిండర్ల వ్యాన్ కాకిలి మీదుగా ఒబ్బంగి వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో డ్రైవర్, హెల్పర్‌లకు ఎటువంటి గాయాలు కాకపోగా..గ్యాస్ సిలిండర్ల నుంచి కూడా ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న స్థానికులు సంఘటనా స్థలానికి వెళ్లి గ్యాస్ సిలిండర్లను జాగ్రత్త పర్చేందుకు సహకరించారు.

రెండు లారీలు ఢీ


రహదారిపై ఉన్న లారీలను క్రేన్ల సహాయంతో తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలిరూరల్: మండలంలోని గొర్లె సీతారామపురం పెట్రోల్ బంకు వద్ద బుధవారం తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లు, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇరుకు రోడ్డు కావడం, రహదారి మధ్యలో ప్రమాదం సంభవించడంతో అటు రామభద్రపురం, ఇటు బొబ్బిలి గ్రోత్ సెంటర్ వరకు భారీగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 5.30 గంటలకు ప్రమాదం జరగ్గా అప్పటినుంచి సుమారు 12 గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి లారీలను క్రేన్ల సహాయంతో రహదారి పక్కకు నెట్టివేయడంతో కొంతమేర ట్రాఫిక్ క్లియర్ అయింది. అలాగే విశాఖ, రాయగడ వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు, స్కూల్ బస్సులు, భారీ రవాణా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థిని


అశ్వినిని అభినందిస్తున్న ఎంఈఓ విజయకుమారి

గంట్యాడ: జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు గంట్యాడ మండలంలోని కొఠారుబిల్లి కేజీబీవీ విద్యార్థిని ఎంపికై ంది. ఇటీవల ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగిన 28వ జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో కొఠారుబిల్లి కేజీబీవీలో చదువుతున్న కుమ్మరి అశ్విని, గండిబోని పవిత్ర, చలుమూరిరీతు సాయిలు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా జట్టులో ఈ ముగ్గురు పాల్గొనగా జిల్లాకు తృతీయస్థానం లభించింది. ఈనెల 29 వతేదీనుంచి ఫిబ్రవరి 2వతేదీ వరకు నంద్యాల జిల్లా రామకృష్ణా రెడ్డి పీజీ కళాశాలలో జరగనున్న 28వ జాతీయస్థాయి పోటీలకు కుమ్మరి అశ్విని ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అశ్వినిని ఎంఈఓ విజయకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ అల్లు జ్యోతిలు అభినందించారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹274

ఉపాధి పనుల్లోనూ రాజకీయం!

- మేట్‌లుగా కూటమి కార్యకర్తలకే అవకాశం
- ఇప్పటివరకు 75 జాబ్‌కార్డులకు ఒక మేట్
- ఇప్పుడు ప్రతి 50 మంది వేతనదారులకు ఒక మేట్ నియామకానికి సన్నాహాలు
- మేట్‌ల నియామకానికి ఉత్తర్వులు జారీ
- ప్రతి వేతనదారు నుంచి రూ.1.50పైసలు మేట్‌కు చెల్లించేలా ఉత్తర్వులు
- రోజుకు రూ.75 చొప్పున కమీషన్

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డుల సంఖ్య	2,08,059
మొత్తం వేతనదారుల సంఖ్య	3,93,303
ప్రస్తుతం ఉన్న మేట్‌లు	2,775 మంది
కూటమి ప్రభుత్వ తాజా ఆదేశాలతో జిల్లాలో ఉండే మేట్‌ల సంఖ్య	7,866


వీరఘట్టం మండలం కత్తులకవిటి సమీపంలోని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులు


వీరఘట్టం మండలంలో పొల్లరోడ్డులో 5వ బ్రాంచ్ కాలువలో పూడికలు తొలగిస్తున్న వేతనదారులు

వీరఘట్టం: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులను కూటమి వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. వేతన దారులను మోటివేషన్ చేసి ఓటు బ్యాంకును పెంచుకునేందుకు కూటమికి, నాయకులకు అనుకూలంగా ఉన్న వారిని మేట్లుగా నియమించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి 50 మంది వేతనదారులకు ఒక మేట్‌ను నియమించాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదునుగా తమ అనుచరులను మేట్లుగా నియమించేందుకు గ్రామాల్లో చర్యలు మొదలయ్యాయి. ప్రతి వేతనదారుకు రూ.1.50 చొప్పున ప్రతిమేట్‌కు ప్రభుత్వం చెల్లిస్తుంది. అంటే ఒక మేట్ పరిధిలో ఉన్న 50 మంది వేతనదారులకు సంబంధించి రోజుకు రూ.75లను మేట్‌కు చెల్లిస్తుంది.

ఇదీ పరిస్థితి..

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లలో 70 శాతానికి పైగా వైఎస్సార్‌సీపీ అభిమానులు ఉన్నట్లు నిఘావర్గాలు చెబుతున్నాయి. అందుచేత ఉపాధి హామీ పథకంలో కూటమి ప్రతినిధులు కూడా ఉండేలా ప్రస్తుత ప్రభుత్వం కొత్త ఆలోచనకు తెరతీసింది.ఇందులో భాగంగానే ప్రతి 50 మంది వేతనదారులకు ఒక కొత్త మేట్‌ను నియమించేందుకు చురుగ్గా కార్యాచరణ చేపట్టారు. గతంలో 75 జాబ్‌కార్డుదారులకు ఒక మేట్ ఉండేవాడు. ఇప్పుడు ప్రతి 50 మందికి ఒక మేట్ నియామకం చేపడు తుండడంతో పార్వతీపురం మన్యం జిల్లాలో గతం కంటే మేట్ల సంఖ్య మూడు రెట్లు పెరగనుంది.

7866మంది మేట్ల నియామకానికి కసరత్తు..

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధిహామీ పథకంలో 2,08,059 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ జాబ్‌కార్డుల పరిధిలో 3,93,303 మంది వేతన దారులు ఉన్నారు. వారంతా పనులకు వచ్చినప్పుడు పర్యవేక్షించేందుకు 2775 మంది మేట్లు ఉన్నారు. ఇది గతం..ఇప్పుడు వేతనదారుల సంఖ్యను బట్టి ప్రతి 50 మందికి ఒక మేట్ చొప్పున 7866 మంది మేట్లను కొత్తగా నియమించేందుకు కసరత్తు చేపడుతున్నారు.ఈ క్రమంలో గతంలో పనిచేస్తున్న మేట్‌లను తొలగించి వారిస్థానంలో కొత్త వారిని నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మేట్ల నియామకం

కొత్తగా మేట్లను నియమించేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రతి 50 మంది వేతన దారుల పనితీరును పర్యవేక్షించేందుకు ఒక మేట్‌ను నియమిస్తాం. అలాగే ఇంతవరకు ఉన్న పాత వారిని తొలగించబోము. ప్రస్తుతం మేట్లుగా పనిచేస్తున్న వారు ఆందోళన చెందవద్దు. ఎవరి పని వారు చేసుకుంటారు.

పి.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

పాత వారిని తొలగిస్తే ఊరుకునేది లేదు



ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న పాత మేట్లను తొలగిస్తారనే ప్రచారం గ్రామాల్లో బాగా సాగుతోంది. మీరు కొత్తవారిని నియమించుకోండి అంతేగానీ పాత వారిని తొలగిస్తే మాత్రం ఊరుకునేది లేదు. పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపాలి.

జంపు కన్నతల్లి, జెడ్పీటీసీ, వీరఘట్టం

సీనియర్ వేతనదారులకు అవకాశం కల్పించాలి



ఉపాధి పనులు చేస్తున్న వారిలో సీనియర్ వేతన దారుల(50 ఏళ్లలోపు)కు మేట్లుగా అవకాశం కల్పించాలి.అంతేతప్ప ఇష్టం వచ్చినట్లు మేట్లును ఎంపిక చేయడం సమంజసం కాదు. ఉపాధి హామీ పనులకు రాజకీయ రంగు పులమొద్దు

దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీపీ, వీరఘట్టం

స్త్రీనిధి నిధులు పక్కదారి

- విచారణ చేపట్టిన ఏపీఎం
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట


స్త్రీనిధి నిధుల దుర్వినియోగంపై విచారణ జరుపుతున్న ఏపీఎం, సిబ్బంది


వాగ్వాదంతో పరస్పరం తోసుకుంటున్న సభ్యుల బంధువులు

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామంలో పొదుపు సంఘాలకు మంజూరైన నిధులు పక్కదారి పట్టాయి. 2022-23 ఏడాదికి మంజూరైన స్త్రీనిధి రుణాలు సంఘంలోని సభ్యులకు ఇవ్వకుండా బయట వ్యక్తులకు అధిక వడ్డీలకు ఈ మొత్తాలను ఇచ్చి సొంతానికి వినియోగిం చుకుంటున్నారని గ్రూప్ నిర్వాహకులపైన, వీఓఏ పాత్రపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దీంతో బుధవారం వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి తన సిబ్బందితో విచారణ చేపట్టారు. గ్రామంలోని చర్చివద్ద నిర్వహించిన ఈ విచారణకు సభ్యులు, వారి కుటుంబ సభ్యులు చేరుకుని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. తమకు అప్పు ఇవ్వకుండా ఇతరులకు ఇచ్చారని, సంఘాల్లోని కొంతమంది రుణాలను పక్కదారి పట్టిస్తున్నారని వాగ్వాదానికి దిగారు. పరస్పర ఆరోపణలతో తోపులాటలు జరిగాయి. కొంతమంది విచారణ చేయాలని, మరికొంతమంది చేయాల్సిన అవసరం లేదంటూ కేకలు వేయగా స్థానిక సర్పంచ్ వసుంధర వారిని సముదాయించారు. అక్కడి నుంచి వారిని పంపి మళ్లీ విచారణ చేశారు. గ్రామంలోని 10 పొదుపు సంఘాలకు గాను 3 సంఘాల్లో దాదాపు రూ.6 లక్షల మేర సభ్యులకు కాకుండా ఇతరులకిచ్చి అవకతవకలకు పాల్పడ్డారని కొంతమంది సభ్యుల ఆరోపణ. ఈ సందర్భంగా ఏపీఎం భాగ్యలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ మరో నాలుగురోజుల్లో విచారణ పూర్తిచేసి వివరాలను తెలియజేస్తామని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య


ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన తులసి

చీపురుపల్లి: అప్పులు తీర్చలేమనే బెంగతో చీపురుపల్లి పట్టణంలో ఓ వివాహిత బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ఈ ఘటనపై హెచ్‌సీ రమణ అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రామాంజనేయకాలనీలో నివాసం ఉంటున్న వద్దాది తులసి(43) బుధవారం తన ఇంటిలోని బెడ్‌రూంలో చీరతో ఉరివేసుకుంది. మృతురాలి భర్త క్షత్రియ రామ్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలు తులసి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా పాన్‌షాప్ నిర్వహిస్తుండగా భర్త రామ్‌సింగ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే అప్పుల బాధతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఉన్నట్లు ఫిర్యాదులో భర్త పేర్కొన్నాడు. అప్పులు తీర్చలేమనే బెంగతో తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదులో తెలిపాడు.

లారీ ఢీకొని భార్యాభర్తల మృతి

- బ్యాంకుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం



లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జయిన గొర్లి మన్మథరావు, అరుణకుమారి, (ఇన్‌సెట్లో) మృతులు మన్మథరావు, అరుణకుమారి(ఫైల్)

జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం గ్రామానికి చెందిన గొర్లి మన్మథరావు(38) అరుణకుమారి (32) బతుకు తెరువు కోసం విశాఖ జిల్లా అగనంపూడిలో నివాసం ఉంటున్నారు. మన్మథరావు వెల్డర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. సంక్రాంతి పండగకు గడసింగుపురం వచ్చి కనుమ మరుసటి రోజే అగనంపూడి వెళ్లి పోయారని గ్రామస్తులు తెలిపారు. బుధవారం అగనంపూడిలోని బ్యాంకుకు భార్యతో కలిసి వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన దంపతులకు తొమ్మిదవ తరగతి చవువుతున్న గొర్లి నిఖిల్ (14), ఏడవ తరగతి చదువుతున్న పాప నీలవేణి (12) ఉన్నారు. ఇటీవలే పండగకు వచ్చి గ్రామంలో కలియదిరిగిన వారు ఇలా అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పీఈటీ పరీక్షలో పాల్గొన్న అభ్యర్థి చికిత్స పొందుతూ మృతి


తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్/దత్తిరాజేరు: స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ నియామకాలకు మంగళవారం నిర్వహించిన పీఈటీ పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థి అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ ఘటనపై ఎస్పీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన బౌడుపల్లి రవికుమార్ (22) పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పీఈటీ పరీక్షలకు హాజరయ్యాడు. పీఈటీ పరీక్షల్లో ప్రాథమిక అర్హత పరీక్ష అయిన 1600 మీటర్ల పరుగులో పాల్గొని అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే వైద్యసిబ్బంది, పోలీస్ సిబ్బంది స్పందించి ప్రాథమిక చికిత్స అందించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత అభ్యర్థి ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మహారాజా సర్వజన ఆస్పత్రికి తరలించి, వైద్యం అందించినప్పటికీ ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో పట్టణంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ వకుల్ జిందల్ మెడికవర్ ఆస్పత్రిని సందర్శించి రవి ఆరోగ్యపరిస్థితిపై వైద్యులతో మాట్లాడి, వారి సూచనల మేరకు విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. విశాఖలోని మెడికవర్‌లో చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో రవి మృతిచెందినట్లు ఎస్పీ తెలిపారు. మృతుడికి తల్లి అక్కమ్మ, తండ్రి బలరాం, అన్నయ్య సతీష్, వివాహమైన అక్కయ్య ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా పశు ఆరోగ్యశిబిరాలు

- త్వరలో పాల ఉత్పత్తి పోటీలు
- జిల్లా పశుసంవర్ధక శాఖ జె.డి వైవీ రమణ


లేగదూడల ప్రదర్శనలో భాగంగా ప్రథమ బహుమతిని సంగం రెడ్డి అచ్చన్నకు అందజేస్తున్న జేడీ వైవిరమణ తదితరులు

గజపతినగరం: రాష్ట్రంలో పశుపోషణకు ప్రాధాన్యం ఇస్తూ తగిన నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామంలో నిర్వహించిన పశుఆరోగ్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను 20.1.2025నుంచి 31.1.2025వరకు పశు ఆరోగ్య శిబిరాలను, అవగాహన సదస్సులను ఏర్పాటు చేయనున్నామని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా పశువుల ఆరోగ్యానికి, వాటి ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించి ఆర్థికంగా అండగా ఉండేదుకు శిబిరాలు, సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత పశుఆరోగ్య శిబిరాల ద్వారా పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా తేలికపాటి శస్త్రచికిత్సలు, ఎదకు రాని, చూడి కట్టని, ఇతర గర్భ కోశవ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అందిస్తామని జేడీ వైవీ రమణ రైతులకు తెలియజేశారు. అలాగే పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రామాల్లో సామూహికంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. రైతులు పశుకిసాన్ క్రెడిట్ కార్డు కలిగి ఉంటే ప్రభుత్వం బ్యాంకుల ద్వారా లోన్లు కల్పించే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో 407 గోకులాలను నిర్మించామని ఇంకా షెడ్‌లు కావాల్సిన ఎడల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పచ్చగడ్డిని సాగు చేసుకునేందుకు వెయ్యి ఎకరాల భూమిని గుర్తించనున్నట్లు చెప్పారు.

త్వరలో పాలఉత్పత్తి పోటీలు

ఫిబ్రవరి నెలలో విజయనగరం, మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలో పాలఉత్పత్తి పోటీలను నిర్వహిస్తామని త్వరలో సమయాన్ని ప్రకటిస్తామని ఆసక్తి గల పాడిరైతులు పాల్గొనాలని సూచించారు. అనంతరం పాతబగ్గాం గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా ప్రథమ బహుమతిని సంగం రెడ్డి అచ్చన్నకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పశుసంవర్థక శాఖ ఎ.డి సీహెచ్ చంద్రశేఖర్, డి.డి.దామోదర్‌రావు, మరుపల్లి వెటర్నరీ డాక్టర్ బి.వెంకటరమణ, స్థానిక సర్పంచ్ లెంక పద్మావతి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి


తాటిపూడి దేవి మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న తాటిపూడి దేవి (16) చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన దేవి మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చింది. ఇంట్లో అడుగుపెడుతూనే వాంతులు చేసుకుంటుండడంతో తండ్రి శ్రీనివాస్ ప్రశ్నించగా పేరు తెలియని పాయిజన్ తాగేసినట్లు చెప్పింది. వెంటనే మహారాజా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 6 గంటలకు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

కబడ్డీ జట్లకు 24 మంది ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు

గంట్యాడ: విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరగనున్న పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనేందుకు కబడ్డీ జట్ల ఎంపికలను మండల కేంద్రంలోని గంట్యాడ హైస్కూల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 64 మంది పురుష క్రీడాకారులు, 37 మంది మహిళా క్రీడాకారులు హాజరు కాగా వారిలో పురుషుల జట్టుకు 12 మందిని, స్త్రీల జట్టుకు 12 మందిని ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు తెలిపారు.

నేటి నుంచి దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియను గురువారం నుంచి జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. ఈ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో తన చాంబర్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 36,974 మందికి దివ్యాంగ పింఛన్లు ఉన్నాయని వాటన్నిటినీ పునఃపరిశీలించేందుకు షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు చెప్పారు. పింఛన్ పొందుతున్న దివ్యాంగులు తమకు కేటాయించిన తేదీల్లో ఆయా ఆస్పత్రులకు వెళ్లి పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు. దీనికోసం జిల్లాలోని ఐదు ఆస్పత్రుల్లో మొత్తం 13 ప్రత్యేక వైద్యబృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు జిల్లా కేంద్రం నుంచి పాల్గొన్నారు.

రామనారాయణం ఓ అద్భుతం

- సినీ నటుడు అవసరాల శ్రీనివాస్


రామనారాయణం ప్రాంగణాన్ని తిలకిస్తున్న అవసరాల శ్రీనివాస్ తదితరులు

విజయనగరం రూరల్: రామనారాయణం ఓ అద్భుత కావ్యమని, స్వయంగా రామాయణాన్ని కళ్లకు కట్టినట్లు కనిపించే దృశ్యకావ్యాలు అమోఘంగా ఉన్నాయని తెలుగు సినీనటుడు అవసరాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం విజయనగరం మండలంలోని రామనారాయణం ప్రాంగణాన్ని ఆయన సందర్శించారు. ఆలయం అంతా కలియదిరిగారు. ఆలయం లోపల ఉన్న రామాయణ గాథ చిత్రాలతో పాటు, వేదపాఠశాల, వాల్మీకి రీసెర్చ్ సెంటర్, అలాగే 80 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రాంగణంలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి పూర్తిగా ఓ అద్భుతమైన ప్రపంచం కనిపిస్తోందన్నారు. ఇంతటి అమోఘమైన ఆలయ రూపకర్తలకు అభినందనలు తెలపక తప్పదన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు రామాయణ ప్రాంగణం జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు.